సాక్షి తిరుపతి

సోమవారం : 26 : ఫిబ్రవరి : 2024



దేశానికే రోల్ మోడల్ జగన్

వైఎస్ జగన్ పాలన దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, ఓపెన్ మైండ్స్ ప్రతినిధులు, మేధావులు ప్రశంసించారు. - IIలో



ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకారం

తిరుపతి ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. - IIలో



సొంతింటి కల నెరవేరేలా..

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సొంత నిధులు వెచ్చించి, పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేశారు. - IIలో

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ స్పందనకు జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అర్జీలు రాయడానికి ముగ్గురు వీఆర్వోలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్షలు



పరీక్షకు హాజరైన అభ్యర్థులు

తిరుపతి అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలు నిర్వహించినట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షలకు 27,921 మందికి గాను అభ్యర్థులకు 23,171 మంది హాజరయ్యారని చెప్పారు. పరీక్షలకు హాజరైన 82.99 శాతం మందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్షలు జిల్లాలోని 61 కేంద్రాలలో నిర్వహించారు. ఏపీపీఎస్సీ నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలను విజయవంతం చేశారని తెలియజేశారు.

పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఎంపీఈడీ మూడవ సెమిస్టర్, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు ఆదివారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాలను ఆన్‌లైన్‌లో వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండి క్యూ లైన్ ఎంబీసీ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 72,175 మంది స్వామివారిని దర్శించుకోగా 29,543 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు టీటీడీ పాలకమండలి సమావేశం

టీటీడీ పాలకమండలి సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవన్‌లో ప్రారంభం కానుంది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన పలు కీలక అంశాలను ఆమోదించనున్నారు.

కిక్కిరిసిన బోయకొండ



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆంధ్ర, కర్ణాట క, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభా గ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సీఐ కృష్ణారెడ్డి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు కల్పించారు.





హంద్రీ–నీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి , ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కుప్పంలో కృష్ణమ్మ పరవళ్లు

ఏళ్ల తరబడి ఎదురుచూపులకు ఫలితం దక్కుతోంది. దశాబ్దాల నీటి కష్టాలకు తెరపడుతోంది. కొండలు.. గుట్టలు దాటి కృష్ణమ్మ వడివడిగా ఉరుకుతోంది. కరువు సీమను సస్యశ్యామలం చేసేందుకు పరవళ్లు తొక్కుతూ వస్తోంది. నేడు రామకుప్పం మండలం రాజుపేట వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా కుప్పం దాహార్తిని తీర్చేందుకు ఉప్పొంగుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజానీకం ప్రశంసల జల్లు కురిపిస్తోంది. ఇచ్చిన మాట చెల్లించిన జననేతకు కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ఇన్నేళ్లు మోసినా చంద్రబాబు చేయలేని మహత్కార్యాన్ని సాధించినందుకు అభినందన మందారమాలలు సమర్పిస్తోంది.

- దశాబ్దాల కల సాకారం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న కుప్పంవాసులు
- సాగు.. తాగునీటి కష్టాలు తీరుస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- నేడు కుప్పం పర్యటనకు విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్
- రాజుపేట వద్ద హంద్రీ–నీవా జలాలు చెరువులకు విడుదల

సాక్షి, చిత్తూరు/కుప్పం : కుప్పం ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. ఎట్టకేలకు కృష్ణా జలాలు చేరుకున్నాయి. 2022 సెప్టెంబర్ 23వ తేదీన కుప్పంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సోమవారం ఈ మేరకు రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ–నీవా ప్రాజెక్టులోని కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణాజలాలను నియోజకవర్గంలోని చెరువులకు విడుదల చేయనున్నారు.

ఉప కాలువ వివరాలు ఇవీ..

హంద్రీ–నీవా ప్రాజెక్టులోని పుంగనూరు ఉప కాలువ 201.8వ కిలోమీటర్ అప్పినపల్లె వద్ద కుప్పం బ్రాంచ్ కెనాల్ ప్రారంభమవుతుంది. 8 మండలాల మీదుగా 123.641 కిలోమీటర్లు సాగుతుంది. ఈ మార్గంలో 3 ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు ఈ కాలువలో ప్రవహించేలా రూపకల్పన చేశారు. కుప్పం నియోజకవర్గంలోని చిట్టచివరిదైన పరమసముద్రం చెరువు వరకు నీరు సరఫరా చేసేలా కాలువను తీర్చిదిద్దారు. కాలువ ద్వారా 8 మండలాల్లోని 4.02 లక్షల జనాభాకు నీటి సరఫరా చేయనున్నారు. మొత్తం 110 చెరువుల ద్వారా 6,300 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించనున్నారు.



రాజుపేట వద్ద కృష్ణా జలాల విడుదల ట్రయల్ రన్

నీరందించనున్న చెరువుల సమాచారం

మండలం	చెరువుల సంఖ్య
పెద్దపంజాణి	01
గంగవరం	05
బైరెడ్డిపల్లె	08
వి.కోట	24
రామకుప్పం	07
శాంతిపురం	25
గుడుపల్లె	27
కుప్పం	18
మొత్తం	110

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మాది వ్యవసాయ కుటుంబం. గతంలో నీటి లభ్యత లేని కారణంగా వ్యవసాయం కష్టతరంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం హంద్రీ– నీవా కాలువ నిర్మాణం పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు కరువుతో తల్లడిల్లిన కుప్పం నియోజకవర్గం ఇకపై సస్యశ్యామలం అవుతుంది. మాకు నీరు అందించి బతుకుదెరువు కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – నారాయణప్ప, కొలమడుగు, శాంతిపురం మండలం

మళ్లీ గెలిపించుకుంటాం



రైతుల కష్టం తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. గతంలో పుస్తెలు తాకట్టు పెట్టి బోర్లు వేసుకున్నా నీరు పడే పరిస్థితి ఉండేది కాదు. ఇకపై ఆ కష్టాలు ఉండవు. కృష్ణమ్మ రాకతో భూగర్భ జలాలు పెరుగుతాయి. సాగునీటికి, తాగునీటికి ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. బెంగళూరుకు వలస పోవాల్సిన పనిలేదు. చక్కగా వ్యవసాయం చేసుకుంటాం. మాకు అండగా నిలిచిన జగనన్ననే మళ్లీ గెలిపించుకుంటాం. – సుగుణప్ప, కొంగణపల్లె, రామకుప్పం మండలం

నేడు కుప్పంలో సీఎం పర్యటన



శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పర్యటించనున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే సీఎం కాన్వాయ్, హెలికాప్టర్ ట్రయల్ రన్‌లను విజయవంతంగా నిర్వహించారు.

పటిష్ట భద్రత

రేణిగుంట : తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జేసీ శుభం బన్సల్, ఎస్పీ మల్లికాగార్గ్ తెలిపారు. ఈ మేరకు అధికారులతో సమీక్షించారు. చిన్నపాటి తప్పిదాలకు సైతం తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఇలా..

- ఉదయం 9.35 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి చేరుకుంటారు. అనంతరం హెలికాప్టర్‌లో కుప్పం పర్యటనకు బయలుదేరుతారు.
- 10:25 గంటలకు రామకుప్పం మండలం రాజుపేటకు చేరుకుంటారు.
- 10.40 గంటలకు హంద్రీ–నీవా నీటిని విడుదల చేస్తారు.
- 11.15కు హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.
- 11.25కు గుండిశెట్టిపల్లివద్ద బహిరంగ సభ స్థలికి చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 1.15గంటలకు హెలికాప్టర్‌లో రేణిగుంటకు బయలుదేరుతారు.
- 2.20 గంటలకు బయలుదేరి రేణిగుంటకు చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు.



సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

వైద్య రంగానికి పెద్ద పీట



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి తదితరులు

తిరుపతి తుడా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి పెద్దపీట వేశాయని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం చేతుల మీదుగా దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 5 నూతన ఎయిమ్స్ వైద్య కళాశాలలను జాతికి అంకితం చేశారు. అంతేకాకుండా ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద దేశంలోని పలు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ)లకు గుజరాత్‌లోని రాజకోట్ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అందులో తిరుపతి జిల్లాలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు అనుబంధంగా రుయా ఆస్పత్రి ప్రాంగణంలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల భువన విజయం ఆడిటోరియంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డీఎంహెచ్ఓ శ్రీహరి, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు తదితరులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారం అనంతరం ఉపముఖ్యమంత్రి, ఎంపీ, జేసీ సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాక్ శిలా ఫలకం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం శంకుస్థాపన చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా శ్వాస సంబంధిత ఎమర్జెన్సీ సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లా ప్రసూతి అధికారి పార్థసారథి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి అరుణ సులోచన దేవి, డీపీఎంఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య శాఖలో 'స్పందన' రేపు

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా వైద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం స్పందన కార్యక్రమం ఉంటుందని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిధిలో పనిచేసే ఉద్యోగుల్లో ఎవరికైనా జీతాలకు సంబంధించిన సమస్యలున్నా ఈ నెల 27న జిల్లా వైద్య శాఖాధికారిని వ్యక్తిగతంగా కలిసి విన్నవించాలని తెలియజేశారు. జిల్లా స్థాయిలో అందిన వినతులను విజయవాడ గొల్లపూడిలోని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయానికి పంపుతామని, వాటికి పరిష్కారం చూపుతామని ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జనరంజకంగా జగనన్న పాలన

- నిస్వార్థ సేవ చేస్తున్న మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించండి
- ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను అందిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి దేశంలోనే ఆదర్శంగా సీఎం జగనన్న జనరంజక పాలనను అందిస్తున్నారని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవలో మునిగిపోయినట్లు తెలిపారు. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట, మంగళం పంచాయతీలో ఆదివారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. మల్లంగుంట పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ముఖ్య అతిథిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. మల్లంగుంట పంచాయతీలో రూ.10 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మోహిత్ రెడ్డి ప్రారంభించారు. శుద్ధ నీటితో నింపిన క్యాన్‌లను మహిళలకు అందజేశారు. అంతకుముందు ఆయా పంచాయతీల్లో గజమాలలతో స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ జెండా ఆవిష్కరణలతో తుడా చైర్మన్ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే, తుడా చైర్మన్ ఇద్దరూ కలిసి మహిళలకు అందజేశారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మోహిత్ రెడ్డి నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమవుతాడని తెలియజేశారు. తనలాగే సంపాదనలో 70 శాతం ప్రజాసేవకు ఖర్చు చేస్తున్నాడని, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో ఉన్న మోహిత్‌రెడ్డి ఆదరించాలని కోరారు. మహిళలు మరింత ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వైఎస్సార్ ఆసరా వంటి పథకాలను జగనన్న అమలు చేస్తున్నట్లు తెలిపారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న మోహిత్ రెడ్డి

విద్యతోనే పేదరికం అంతం

అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో పేదరికం ఒక్క విద్యతోనే దూరమవుతుందని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా దీవెన పథకాలను అమలు చేసి పేద విద్యార్థుల ఉన్నత చదువుకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. దేశం గర్వించేలా విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించినట్లు వెల్లడించారు. తాము కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చిపోయే వాళ్లం కాదని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏ రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజాశీస్సులతో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి ప్రజల ఆదరణ పొందారని గుర్తుచేశారు. ఆయన అడుగుజాడల్లో తాను నడుచుకుంటానని స్పష్టం చేశారు.

అభివృద్ధికి దిక్సూచిలా..

మల్లంగుంట పంచాయతీలో రూ.12.14 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టగా, 32 సిమెంట్ రోడ్లు వేసినట్లు తెలిపారు. అలాగే రూ.28.33 కోట్ల సంక్షేమ నిధులు పంపిణీ జరిగిందన్నారు. ఇందులో అత్యధికంగా రూ.6.23 కోట్లు వైఎస్సార్ పెన్షన్ కానుకగా, రూ.4.13 కోట్లు వైఎస్సార్ ఆసరా పథకం కింద ప్రజలకు అందజేశామన్నారు. మంగళం పంచాయతీలో రూ.3.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, సంక్షేమ పథకాల కింద రూ.21.36 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఉపేంద్ర రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మునస్వామి రెడ్డి, జయచంద్రా రెడ్డి, నారాయణ రెడ్డి, మునికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గుర్రపు స్వారీ యాత్ర ప్రారంభం



హార్స్ రైడ్ యాత్రకు బయలుదేరిన ఎన్‌సీసీ క్యాడెట్లు

తిరుపతి సిటీ: తిరుపతి ఎన్‌సీసీ 2ఏ ఆర్ అండ్ వీ రెజిమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ నగర్‌లో హార్స్ రైడ్ (గుర్రపు స్వారీ) యాత్ర ప్రారంభమైంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సుమారు 300 కిలోమీటర్లు సాగే ఈ గుర్రపు స్వారీ యాత్ర ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమాండర్ వీఎం రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు 'న్యూ ఇండియా విజన్–2047 అమృత్ కాల్' నినాదంలో భాగంగా హార్స్ రైడ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ప్రారంభించామన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం, ఎన్‌సీసీపై యువతకు అవగాహన కల్పించడం, సామాజిక సేవ, దేశభక్తిని పెంపొందించడం, పశువులకు హెల్త్ క్యాంపులు నిర్వహించడమే యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. మొదటి రోజు యాత్రలో సుమారు 10 గుర్రాలతో ఎన్‌సీసీ క్యాడెట్లు యాత్రకు బయలుదేరుతున్నారని తెలిపారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ యోగేష్ దుగ్గ కోటి, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సాహస యాత్ర స్ఫూర్తిదాయకం

ఏర్పేడు: గుర్రపు ప్రదర్శన, సాహస యాత్ర చాలా స్ఫూర్తిదాయకమని తిరుపతి ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ ప్రకాష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గుర్రపు ప్రదర్శన, సాహస యాత్ర కార్యక్రమం నిర్వహించారు. 30 మంది క్యాడెట్లతో కూడిన ఎన్‌సీసీ బృందం, 7 గుర్రాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. హర్డిల్స్‌తో కూడిన వివిధ రకాల గుర్రపు విన్యాసాలు నిర్వహించారు. ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ గుర్రాల లక్షణాలు, ఎన్‌సీసీ, ఆర్‌వీసీ పాత్ర, వాటి ప్రాముఖ్యత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి ఎన్‌సీసీ అధికారి మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుపతి ఐఐటీలో గుర్రాలతో ఎన్‌సీసీ క్యాడెట్లు

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకారం: టీటీడీ చైర్మన్



డైరీ ఆవిష్కరణలో టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్ర

తిరుపతి తుడా: తిరుపతి ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సంపూర్ణ సహకారాలు అందిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, నగర మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ఆయన ప్రెస్‌క్లబ్– 2024 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ 30 సంవత్సరంలోకి అడుగు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే తిరుపతి ప్రెస్‌క్లబ్ ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది అని అన్నారు. ప్రెస్‌క్లబ్ సెక్రటరీ బాలచంద్ర మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సభ్యుల సంక్షేమానికి మరింత కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ట్రెజరర్ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీలు లావణ్య కుమార్, దినేష్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

రగ్బీ అబ్జర్వర్‌గా సేతురామ్



తిరుపతి సిటీ : ఖేలో ఇండియా నాలుగో ఎడిషన్‌లో భాగంగా అస్సాంలోని గౌహతి పట్టణంలో జరుగుతున్న అఖిల భారతీయ రగ్బీ క్రీడలకు జాతీయ సంస్కృత వర్సిటీకి చెందిన అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ వి సేతురామ్‌ను కేంద్రం నియమించింది. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన క్రీడలు ఈ నెల 29తో ముగియనున్నాయి. వర్సిటీ నుంచి అబ్జర్వర్‌గా నియమితులైన సేతురామ్‌ను వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ అభినందించారు.

జగనన్న పాలన దేశానికే రోల్ మోడల్



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న ఓపెన్ మైండ్ సంస్థ ప్రతినిధులు



సమావేశానికి హాజరైన పలు కళాశాలకు చెందిన విద్యార్థులు

- మంచి చేసి ఉంటేనే ఆశీర్వదించండి అంటున్న ఏకైక సీఎం జగన్
- సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- ఓపెన్ మైండ్స్ సంస్థ ప్రతినిధులు, మేధావుల పిలుపు

తిరుపతి సిటీ : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో జగనన్న అందిస్తున్న పాలన దేశానికే రోల్‌మోడల్‌గా మారిందని ఎన్‌జీఓ సంస్థ ఓపెన్ మైండ్స్ ప్రతినిధులు, మేధావులు కొనియాడారు. తిరుపతి అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల వేదికగా ఓపెన్ మైండ్స్ సంస్థ, మేధావుల వర్గం సంయుక్త ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర సమతుల్య అభివృద్ధి–భారతదేశానికి ఆదర్శం' అనే అంశంపై యువతకు అవగాహన సదస్సును నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించి దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి వ్యక్తికీ సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందించిందని స్పష్టం చేశారు. మధ్యవర్తిత్వం, లంచగొండితనం, అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పారదర్శకంగా పథకాలను వలంటీర్ల ద్వారా గడప వద్దకే చేరవేయడం ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రయోజనాలపై యువత చొరవ తీసుకుని ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. మంచి చేసి ఉంటేనే ఓటు వేయండని పిలుపునిచ్చిన ఏకైక సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచారన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ దీవెన పథకాలను అమలు చేసి పేద విద్యార్థులు ఉన్నత విద్యను అందించేందుకు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. నాడు–నేడుతో పాఠశాలల దిశ మార్చి, సీబీఎస్‌ఈ, టోఫెల్ శిక్షణ ఇవ్వడం అద్భుతమన్నారు. ఎడెక్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ఆన్‌లైన్ ద్వారా విదేశీ విద్యను పేద విద్యార్థులకు అందించడం చరిత్రాత్మకమన్నారు. అనంతరం విద్యార్థులు, ఓపెన్‌మైండ్ సంస్థ ప్రతినిధులు, మేధావులు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో నగరంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలతోనే చదువుకుంటున్నా



మాది పేద కుటుంబం. చదువుకునే ఆర్థిక స్థోమత లేదు. జగనన్న ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనతోనే మా తమ్ముడు, నేను చదువుకుంటున్నాం. మా లాగా ఎంతో మంది నేడు ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్నారంటే అది కేవలం జగనన్న చలవే. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. ఆయన రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది, మా తల్లిదండ్రులను, బంధువులను అప్రమత్తం చేసి అండగా నిలబడతాం.

– సునీత్ గణేష్, బీటెక్, అన్నమాచార్య కళాశాల, తిరుపతి

పేదలకు ఉచితంగా విదేశీ విద్య



నిరుపేద విద్యార్థుల కోసం జగనన్న ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి వారు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షిస్తున్నారు. ఇందులో భాగంగా విదేశీ విద్యాదీవెన ప్రవేశపెట్టి సుమారు రూ.1.25 కోట్ల వరకు ఫీజు చెల్లిస్తున్నారు. దీంతో పాటు ఎడెక్స్ ఆన్‌లైన్ విద్యా సంస్థ ద్వారా ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో పేద విద్యార్థులు తమకు నచ్చిన కోర్సును చదువుకునే అవకాశం కల్పించడం అద్భుతంగా భావిస్తున్నా. మంచి చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారు.

–ధోనిక, బీటెక్, అన్నమాచార్య కళాశాల, తిరుపతి

దేశానికి రోల్ మోడల్ సీఎం



ఇప్పటివరకూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యువతకు, విద్యార్థులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అయన దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారు. ఎడెక్స్ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా విదేశీ విద్యను సామాన్యుడికి చేరువ చేశారు. అమ్మ ఒడి జగనన్న మానసపుత్రిక. మాకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన అందడం వల్లనే ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నాం. జగనన్నకు ధన్యవాదాలు.

–రిజ్వాన, బయోటెక్నాలజీ, ఎస్‌డీహెచ్‌ఆర్ కళాశాల, తిరుపతి

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



రాష్ట్రంలో 2019 నుంచి విద్యారంగానికి మహర్దశ వచ్చింది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. బోధన విధానంలో సీబీఎస్‌ఈ, ఇంగ్లీష్ మీడియం అదనంగా చేరింది. డ్రాపవుట్స్‌ను పూర్తి స్థాయిలో నివారించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో వారి ఆర్థిక స్థితి మెరుగుపడింది. ఈ విషయాలను ప్రజలు మర్చిపోరు. ఆయన రుణం తీర్చుకుంటారు.

–పి తేజు, యూజీ విద్యార్థి, ఎస్‌డీహెచ్‌ఆర్, తిరుపతి

ఉపాధి, ఉద్యోగాలకు పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ అందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తోంది. ప్రభుత్వ విద్యాసంస్థలలోనే వృత్తి నైపుణ్యంపై శిక్షణ ఇవ్వడం శుభపరిణామం. ప్రాథమిక విద్యతో పాటు ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా యువతను తయారు చేయడం చాలా గొప్ప విషయం. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– సాయిశ్వేత, బీటెక్, అన్నమాచార్య కళాశాల, తిరుపతి

నెరబైలు వ్యక్తి తిరుపతిలో హత్య

తిరుపతి రూరల్: ఆస్తి గొడవలు రక్తం పంచుకు పుట్టిన తమ్ముడి ప్రాణం తీసేలా చేసింది. కన్నబిడ్డను చూసేందుకు వచ్చిన వ్యక్తిని వెంటాడి మరీ కత్తులతో నరికి చంపారు. తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. స్థానికుల కథనం మేరకు, ఎర్రావారిపాళెం మండలం నెరబైలు పంచాయతీ పులిబోనుపల్లెకు చెందిన కానాల చంద్రశేఖర్‌రెడ్డి(42)కి తన అన్న రామ్మోహన్‌రెడ్డితో ఆస్తి తగాదాలు ఉన్నాయి. చంద్రశేఖర్‌రెడ్డి కుమారులు ఇద్దరు సి.మల్లవరం పంచాయతీ శ్రీనివాస మంగాపురం– కాలూరు రహదారిలోని నారాయణ హైస్కూల్లో చదువుతున్నారు. ఆదివారం కావడంతో నాన్–వెజ్ వండుకుని కొడుకులకు ఇచ్చేందుకు చంద్రశేఖర్‌రెడ్డి వచ్చాడు. ముందుగానే సమాచారం తెలుసుకున్న దుండగులు స్కూల్ సమీపంలోనే కత్తులతో దాడికి తెగబడ్డారు. విచక్షణరహితంగా నరికారు. సినిమా తరహాలో కత్తులతో వ్యక్తిని నరుకుతుండగా ప్రత్యక్షంగా చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు ప్రయాణికులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో దుండగులు పారిపోయారు. కొనఊపిరితో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఇదిలా ఉంటే రౌడీషీటర్‌గా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడిపై బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తమీమ్ అహ్మద్ తెలిపారు.

సొంతింటి కల నెరవేరేలా..



చిందేపల్లి జగనన్న లేఅవుట్‌లో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవ
- చిందేపల్లిలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపు

తిరుపతి రూరల్: దశాబ్దాల పాటు సొంత ఇంటి కోసం కళ్లల్లో ఒత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్న వారి కల తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో నెరవేరింది. వేలాది మంది వెంట రాగా ఆదివారం ఏర్పేడు మండలం చిందేపల్లిలోని జగనన్న లేఅవుట్ జన జాతరను తలపించింది. తిరుపతి రూరల్, అర్బన్ మండలం పరిధిలోని ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో దాదాపు నాలుగు వేల మంది పేదలకు చిందేపల్లి జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు మంజూరు చేశారు. వారికి ఆ మేరకు ఇంటి పట్టాలను సైతం అందించారు. అయితే చిందేపల్లిలో కోర్టు కేసులు, సాంకేతిక కారణాల వల్ల ఇప్పటి వరకు వారికి ఇంటి స్థలాలను చూపించలేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో పర్యటించారు. ఇంటి స్థలాల సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవో నిషాంత్‌రెడ్డితో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఇంటి స్థలాలు చూపించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందని ఆరా తీశారు. కోర్టు, రైతులకు పరిహారం వంటి సమస్యలపై సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘంగా చర్చించారు. అర్హులైన దాదాపు 4 వేల మంది పేదలకు ఇంటి స్థలాలను అందించేందుకు రైతులకు రూ.20 లక్షలకు పైగా పరిహారం ఇవ్వాల్సి ఉందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. రైతులకు పరిహారంగా ప్రభుత్వం ఇవ్వాల్సిన దాదాపు రూ.20 లక్షలను తన సొంత నిధుల ద్వారా అందిస్తానని మోహిత్‌రెడ్డి ముందుకు వచ్చారు. చెప్పటమే కాకుండా వాటిని అధికారుల ద్వారా రైతులకు అందించారు. దీంతో చిందేపల్లి జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలాలను చూపించేందుకు భూమి చదును, ప్లాట్ల హద్దులను సూచించేలా రాళ్లు నాటే కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. లబ్ధిదారులు రెండు వేలకు మందికి పైగా ఆదివారం చిందేపల్లి లేఅవుట్‌కు చేరుకున్నారు. వారందరికీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటి స్థలాలను చూపించారు. చిత్తశుద్ధితో సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి నిర్మాణాలకు తోడ్పాటు

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ప్రతి లబ్ధిదారుడికి ఇంటి స్థలాలను చూపిస్తామని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఇంటి స్థలాలను చూపించడమే కాకుండా వాటిని రిజిస్ట్రేషన్ చేయించడంలోనూ, ఇంటి నిర్మాణంలోనూ తోడ్పాటు అందిస్తామన్నారు. చిందేపల్లిలో లబ్ధిదారులకు ఇంటి స్థలాలను చూపించిన అనంతరం ఆయన వారినుద్దేశించి మాట్లాడారు. భూ సమస్యను వందశాతం తొలగించామని, యుద్ధ ప్రాతిపదికన ఇంటి స్థలాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిందేపల్లితో పాటు వడమాలపేట మండలం సీతారామాపురం, రామచంద్రాపురంలోని నెన్నూరు లేఅవుట్లోనూ ఇప్పటికే ప్లాట్లకు నంబరింగ్ చేశామని, రెండు రోజుల్లో లబ్ధిదారులకు వాటిని అప్పగిస్తామన్నారు. ప్రతి పేదవానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ఎదుట నిరసన



జనసేన పార్టీ కార్యాలయం వద్ద గుమికూడిన బలిజ సంఘం నాయకులు

సత్యవేడు: బలిజ సంఘం మండల అధ్యక్షుడు బాలమురళీ కృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గాంధీరోడ్డులో సాయిబాబా గుడి సమీపంలో ఆదివారం జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. దీనికి తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పుల లవ్యన్యా కుమార్ హాజరై కార్యాలయం ప్రారంభిస్తారని ప్రచారం సాగించి బ్యానర్లు కట్టారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలనుంచి జనసేన అభిమానులు హాజరై కార్యాలయం ముందు డ్రమ్ములు వాయిస్తూ సందడి చేశారు. బలిజ సంఘం అధ్యక్షుడు తన అనుచరులతో అక్కడికి చేరుకొని జిల్లా పార్టీ అధ్యక్షుడు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇతర మండలాల నుంచి వచ్చిన జనసేన మండలం నాయకులు బలిజసంఘం నాయకులు మధ్య కొంత సేపు వాగ్వాదం నెలకొంది. సత్యవేడు బలిజ సంఘం నాయకులు పలుమార్లు పసుపులేటిని కలిసేందుకు వెళితే అనుమతించకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి ప్రతిఫలంగా సత్యవేడు వస్తున్న ఆయనకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. స్థానిక యువకులు బలిజ సంఘం అధ్యక్షుడికి అండగా నిలిచారు. దీంతో బాలమురళీ కృష్ణ కారును కార్యాలయం మెట్లకు అడ్డంగా ఉంచి 12 గంటల వరకు నిరసన తెలిపారు. తిరుపతి నుంచి సత్యవేడు సమీపం వరకు వచ్చిన పసుపులేటి హరిప్రసాద్, విషయం తెలుసుకుని వెనుతిరిగి వెళ్లారు. ఆ పార్టీ మండల యువ నాయకులే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, జెండా ఆవిష్కరించారు.

పశ్చిమ బెంగాల్ కార్మికుడి మృతి

తిరుపతి రూరల్: బిల్డర్ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ పర్యవేక్షణ లోపం వల్ల బతుకుదెరువు కోసం పొట్టచేతపట్టుకుని వచ్చిన పశ్చిమబెంగాల్ కార్మికుడి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. తిరుపతికి చెందిన బీజేపీ నాయకుడి కుమారుడు రూరల్ మండలం చెర్లోపల్లిలో గోల్డెన్ తులిప్ పేరుతో భారీ భవనాలను నిర్మిస్తున్నాడు. ఇందులో పనిచేసేందుకు పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికులను రప్పించారు. ఆ కార్మికుల్లో ఒకడైన అజీజ్ మండల్(26) ఆదివారం భవన నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యాడు. కింద నుంచి మెటీరియల్‌ను ఏడో అంతస్తుకు తరలిస్తుండగా, క్రేన్ తీగలు తెగిపోవడంతో అజీజ్ మండల్ కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు ఆరోపిస్తున్నారు. తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ ప్రమాదస్థలాన్ని సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. బంధవులకు సమాచారం అందించామని, ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

చేడిమాలలో ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

చిల్లకూరు : మండలంలోని చేడిమాలలో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి వివరాల మేరకు గ్రామానికి చెందిన ఉసా వెంకటసుబ్బమ్మ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో వెంకటగిరిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఇంటికి వచ్చే సమయానికి చోరీ అయింది. ఆమె పోలీసులకు సమాచారం అందించింది. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ బాధితులు కథనం మేరకు ఇంటిలోని బీరువాలో రూ.లక్ష నగదు, ఆరు సవర్ల బంగారు వస్తువులు, వెండి వస్తువులు చోరీ అయ్యాయన్నారు. తిరుపతి నుంచి క్లూస్ టీంను కూడా పిలిపించి వేలి ముద్రలను సేకరిస్తున్నట్లు వివరించారు.

న్యాయం చేయాలని రైతు కుటుంబం నిరసన



న్యాయం చేయాలని కోరుతున్న దళిత రైతు కుటుంబ సభ్యులు

కేవీబీపురం: తమ భూమిని టీడీపీ నాయకులు ఆక్రమించుకున్నారని, న్యాయం చేయాలని కేవీబీపురం మండలం మఠం గ్రామానికి చెందిన రైతు (వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్ వెంకటయ్య), అతని కుటుంబ సభ్యులు కోరారు. వారు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం తన పొలంలో నిరసన చేపట్టారు. వెంకటయ్య తండ్రి కలపాటి శీనయ్యకి 1980లో అప్పటి ప్రభుత్వం మఠం సర్వే నెంబర్ 448లో 2ఏలోని 1.39 ఎకరాల భూమికి పట్టా ఇచ్చింది. అప్పటి నుంచి పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. టీడీపీ హయాంలో ఆ భూమిని అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత గల్లా సుదర్శన్ ఆక్రమించుకుని తన భూమిలో కలుపుకున్నాడు. ఈ విషయాన్ని రైతు వెంకటయ్య రెవెన్యూ అధికారులకు తెలిపి న్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదు. తాను గత టీడీపీ హయాంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌గా పనిచేశానని, సర్పంచ్ ఎన్నికల్లో వారి ప్రలోభాలకు లొంగకపోవడంతో తనపై టీడీపీ నేత కుటుంబం కక్ష కట్టి ఇలా ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. తన పొలాన్ని ఆక్రమించుకున్న వారు ప్రస్తుతం నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారని తెలిసి, న్యాయం చేయాలని మీడియా ద్వారా జిల్లా అధికారులను వేడుకుంటున్నట్లు వెంకటయ్య, అతని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై తహసీల్దార్ శ్రీరాములనాయక్‌ను వివరణ కోరగా ఈ విషయంపై తక్షణం విచారిస్తామని తెలిపారు.